ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

3

మంగళవారం 12 మార్చి 2024

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.31 | సహర్: 5.04 (బుధవారం)



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.134	194	221
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 | కనిష్ఠం 24.0

బ్రహ్మోత్సవ సంబురం



భక్తుల ఇలవేల్పు దైవం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వస్తిపుణ్యాహవాచన పూజలతో వేదపండితులు సోమవారం వైభవంగా శ్రీకారం చుట్టారు. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి శుద్ధ ద్వాదశి ఈనెల 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా, సోమవారం ఉదయం 10గంటలకు అర్చకబృందం, రుత్వికులు వేదోక్త పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, స్వస్తిపుణ్యాహవాచన పూజలతో దేవదేవుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు తెరతీశారు. విశ్వశాంతి, లోకకల్యాణార్థం నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలను పాంచరాత్రాగమ శాస్త్రానుసారం ప్రధానాలయంలో నిర్వహించనున్నారు.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- వైభవంగా లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా స్వస్తిపుణ్యాహవాచనం, విశ్వక్సేనారాధన
- రాత్రి మృత్సంగ్రహణం, అంకురారోపణ పర్వాలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

సీఎం పర్యటన ఇలా..

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబసమేతంగా వచ్చారు. ఆయనతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో సోమవారం ఉదయం 10గంటలకు గుట్టకు చేరుకున్నారు. సీఎంకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. కొండ కింద ఉత్తర దిశగా ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి ప్రెసిడెన్సియల్ సూట్‌కు కాన్వాయ్‌లో చేరుకున్నారు. కొండపైకి 10.33గంటలకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా వచ్చారు. 10.42గంటలకు ఉత్తర ద్వారం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భాలయంలో సీఎంతో పాటు ఆయన భార్య గీతారెడ్డి, మంత్రులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రధానాలయంలో అర్చకులు, వేదపండితులు సీఎంకు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మాడవీధుల్లోని అద్దాల మండపంలో సీఎంకు స్వామివారి చిత్రపటం జ్ఞాపికను అందజేశారు. 11.45గంటలకు యాదగిరిగుట్ట నుంచి సీఎం హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

నేటి ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, వేదపారాయణాలు, సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం



లక్ష్మీనృసింహుల కల్యాణ పట్టువస్త్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రులు

విశ్వక్సేనుడికి తొలిపూజ



దేవతల సర్వసేనానాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజతో స్వామివారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టా రు. ప్రధానాలయంలోని గర్భాలయం ఎదుట పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో దివ్య మనోహరంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేశారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగడానికి నిర్దేశించిన మంత్రోచ్ఛరణలతో తొలిపూజా పర్వాలను నిర్వహించారు.

బ్రహ్మోత్సవ సంకల్ప పూజలు

బ్రహ్మోత్సవాల్లో ఆగమశాస్త్ర ప్రకారం జగద్రక్షకుడు లక్ష్మీనృసింహుడికి అర్చకులు రక్షా సూత్రధారణ చేసి మహోత్సవ పర్వాలు నిర్విఘ్నంగా చేపట్టేందుకు ప్రధానార్చకులతో పాటు అర్చకబృందం కంకణాలు ధరించారు. అనంతరం నిర్వాహకులను దీక్షాబద్ధులను చేస్తూ అర్చకులు అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావుతో పాటు ముఖ్యమైన అధికారులకు, రుత్వికులకు కంకణధారణ చేశారు. అదేవిధంగా బ్రహ్మోత్సవ ప్రారంభ ప్రాధాన్యంతో చతుర్వేద మంత్రపారాయణాలు, ఉపనిషత్తులు, పంచ సూక్తములు, సుదర్శన శతక, రామాయణ భాగవతములు, క్షేత్ర మహత్యాన్ని, మూల మంత్ర పఠనాలు చేశారు.



ఆలయ సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేద పండితులు

స్వస్తిపుణ్యాహవాచనం

దేవదేవుడు లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ ఆరంభానికి యాదగిరిగుట్ట కొండపై పరిసరాలను శాస్త్రోక్తంగా శుద్ధి చేయడానికి స్వస్తిపుణ్యాహవాచన పూజలు నిర్వహించారు. దివ్యమనోహరంగా అలంకృతులైన లక్ష్మీనరసింహుల ఎదుట పంచామృత కళశాలకు, దర్భ(గరిక)లతో వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించారు. శాంతి మంత్రపఠనాల అనంతరం ఈ పుణ్యాజలాలతో స్వామి వారికి నిజాభిషేకం నిర్వహించి ప్రధానాలయం, బాలాలయ మండపం, కొండపై నలు దిక్కుల పవిత్ర జలాన్ని సంప్రోక్షిస్తూ స్వస్తిపుణ్యాహవాచనం నిర్వహించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం

లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీతారెడ్డి సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామెల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చాంద్ ముబారక్

- నేటి నుంచి రంజాన్ మాసం
- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు



నల్లగొండ కల్చరల్, మార్చి 11: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కన్పించడంతో మంగళవారం ఉదయం నుంచే కఠిన ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ముస్లింలు ఉపవాస దీక్ష పాటించనున్నారు. రంజాన్ మాసం ప్రారంభమవడంతో ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు ఖురాన్ పఠనాలు, నమాజ్, సహర్, ఇఫ్తార్, తరావీ ప్రార్థనలతో మసీదుల్లో సందడి నెలకొననుంది. అదేవిధంగా రంజాన్ మాస ప్రత్యేక వంటకాలైన హరీస్, హలీమ్ దుకాణాలు ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్ల అమలుకు బీసీలు గళమెత్తాలి

భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

నల్లగొండ టౌన్, మార్చి 11 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా బీసీ మేధావులు గళమెత్తాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం బీసీ హక్కుల సాధన కోసం భారత్ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము మూడు ప్రధాన డిమాండ్లతో ముందుకెళ్తున్నామన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కొత్తగా దాదాపు 24వేల మంది బీసీలు ప్రజా ప్రతినిధులు అవుతారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పిందని గుర్తు చేశారు. ఆ మేరకు హామీని అమలుపర్చాలన్నారు. 2024-25 బడ్జెట్లో బీసీల సంక్షేమం కోసం రూ. 20వేల కోట్లు కేటాయించాలని, అసెంబ్లీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏప్రిల్ 12న వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో కలుపుకొని ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కర్ణాటకలో కులగణన చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ బీహార్‌లో కులగణకు సంబంధించి కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయనే సాకుతో చేతులెత్తేసిందని విమర్శించారు. తెలంగాణలో అలా జరగకుండా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టమైన కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చుకునే సౌలభ్యం కల్పించాలని, తద్వారా జనాభా ఆధారంగా రాష్ట్రాల్లో రిజర్వేషన్లు చేసుకోవచ్చని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ గతంలో ప్రతిపాదించారని గుర్తు చేశారు. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ అవకాశాన్ని ఇవ్వడంలేదని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.కోల్పోతున్న రిజర్వేషన్లపై బీసి మేధావులు ముందుకు వచ్చి పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రూ.26లక్షల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5వేల కోట్లే కేటాయించిందని విమర్శించారు. హక్కుల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాడాల్సిన అవసరముందన్నారు. అంతకుముందు స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ చైర్మన్ గట్టు రాంచందర్‌రావు, కన్వీనర్ శివశంకర్, కోకన్వీనర్లు రాజారాం, శివకుమార్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, గీతకార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పల్లె రవికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముందడి సైదిరెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, తండు సైదులుగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, బొర్ర సుధాకర్, చీర పంకజ్‌యాదవ్, లొడంగి గోవర్దన్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఫరీదుద్దీన్, అయితగోని యాదయ్య, లక్ష్మయ్య, మిర్యాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ వరించేదెవరికో?



హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన కేసీఆర్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడుతుందన్న సమాచారం మేరకు అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికకు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ ఒక్కో సీటుకు అభ్యర్థులను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థుల కసరత్తు వేగవంతమైంది. సోమవారం హైద్రాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ నివాసంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రెండు, మూడురోజుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక
- ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలతో మాజీ సీఎం కేసీఆర్ భేటీ
- క్యాడర్‌ను సమాయాత్తం చేయాలని సూచన
- శానంపూడి చేరికతో బీజేపీలో ముసలం
- ఎంపీ టికెట్ ఇవ్వవద్దని డిమాండ్

పార్లమెంటు ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని, రెండు, మూడురోజుల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఉమ్మడి జిల్లా నేతలకు సంకేతాలిచ్చారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బి.లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్న ఈ సమావేశంలో తాజా పరిణామాలు, జిల్లాలో చోటు చేసుకున్న మార్పులు, చేర్పులపై కేసీఆర్ ఆరా తీసినట్టు తెలిసింది. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరిన నేపథ్యంలో క్యాడర్ నైరాశ్యానికి గురికాకుండా నియోజకవర్గంలో చర్యలు తీసుకోవాలని కేసీఆర్ సూచించినట్టు సమాచారం. జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లకు సామాజిక సమీకరణాలు, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు దీటైనపోటీ ఇచ్చే నేతలను ఎంపికచేయాలని ముఖ్యనేతలు ఈ సందర్భంగా సూచిస్తున్నట్టు తెలిసింది.

శానంపూడి చేరికను వ్యతిరేకిస్తున్న బీజేపీ నేతలు

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని బీజేపీలో చేర్చుకోవడంపై పార్టీలో అసంతృప్తి చెలరేగుతోంది. ఉమ్మడి జిల్లా నేతలను, కార్యకర్తలను కనీసం సంప్రదించకుండా నేరుగా ఎలా చేర్చుకుంటారని ముఖ్యనేతలు, క్యాడర్ బీజేపీ అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తోంది. సోమవారం బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ వెళ్లి సైదిరెడ్డిపై వారి అభ్యంతరాలను నివేదించారు. ఆయన్ను పార్టీలో చేర్చుకున్నప్పటికీ, ఎంపీ టికెట్ మాత్రం ఇవ్వవద్దని కోరారు. ఈ మేరకు పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు. బీజేపీకి చెందిన ఉమ్మడి జిల్లా మాజీ కీలక ప్రజాప్రతినిధి సైదిరెడ్డి చేరికపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారని, పార్టీ నిర్ణయాలు ఇలా ఏకపక్షంగా ఉంటే తమదారి తాము చూసుకోవాల్సి ఉంటుందని అల్టిమేటం జారీ చేసినట్టు చెబుతున్నారు. బండి సంజయ్‌కుమార్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీ కార్యకర్తలను సైదిరెడ్డి ఇబ్బందిపెట్టారని, గుర్రంబోడు తండా భూముల విషయంలో బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టించారని, బండి సంజయ్ పర్యటన సందర్భంగా దాడుల్లో ఆయన పాత్ర ఉందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ కార్యకర్తల్ని తీవ్రస్థాయిలో ఇబ్బంది పెట్టిన మాజీ ఎమ్మెల్యేను పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు నల్లగొండ పార్లమెంటు స్థానంలో గట్టి పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో పాటు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేను బీజేపీ చేర్చుకోగా, సదరు మాజీ ఎమ్మెల్యేపై పాత క్యాడర్, నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం తలనొప్పిగా మారింది. ఈ వివాదాన్ని అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందో చూశాకే తదుపరి నిర్ణయం ఉంటుందని సైదిరెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్న నేతలు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో బీఆర్ఎస్ అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కుతాయనే అంశంపై పార్టీలో చర్చ కొనసాగుతోంది. పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటించిన శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి సోమవారం కేసీఆర్‌తో జరిగిన భేటీకి కూడా హాజరుకాలేదు. నల్లగొండ స్థానంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ తేరా చిన్నపరెడ్డి, తెలంగాణ ఉద్యమనేత చాడ కిషన్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది.

‘ప్రజావాణి’ ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టర్ హరిచందన దీప్తి

నల్లగొండ టౌన్, మార్చి 11: ‘ప్రజావాణి’ ఫిర్యాదుల పరిష్కారం, ప్రభుత్వ పథకాల సత్వర అమలుపై అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ‘ప్రజావాణి’లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాల వారీగా సంబంధితశాఖ అధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల విధులు కేటాయించేందుకు వెంటనే ఉద్యోగుల వివరాలను సమర్పించాలన్నారు. టీఎస్ ఐపాస్, డీఐపీసీ కింద వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. టీఎస్ ఐపాస్ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. డీఐపీసీ కింద ఎస్సీ, ఎస్టీ యూనిట్లకు సుమారు 56 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి సిద్ధంగా ఉంచాలని, రవాణాశాఖ అనుమతి వచ్చాక మంజూరు చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్వో డి.రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

పోలీస్‌శాఖను ప్రజలకు చేరువచేయాలి

ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ టౌన్, మార్చి 11: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవరిస్తూ వారికి శాఖపై నమ్మకం పెంచాలని, ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయాలని ఎస్పీ చందనాదీప్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 40మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి న్యాయం చేయాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధితుల ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తామని తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

సాగర్ కుడికాల్వకు నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, మార్చి 11: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కుడికాల్వకు నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు నిలుపుదల చేశారు. ఏపీ రాష్ట్రంలోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నెల 1వ తేదీన కేఆర్ఎంబీ సభ్యుల పర్యవేక్షణలో కుడికాల్వకు నీటి విడుదలను ప్రారంభించారు.

కుడికాల్వకు కేటాయించిన మూడు టీఎంసీల నీటి వాటా పూర్తికావడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారానికి 514.20 అడుగులు (138.9118 టీఎంసీలు)గా నమోదైంది. ఎగువనుంచి ఎటువంటి వరద రావటం లేదు. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కోదాడలో రూ.33.68లక్షల ఔషధాలు స్వాధీనం

రూ.1.31లక్షల గడువు తీరిన మందుల గుర్తింపు

నాలుగు గోదాంలను సీజ్ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



కోదాడలోని గోదాముల్లో నిల్వ చేసిన ఔషధాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ, మార్చి 11: సూర్యాపేట జిల్లా కోదాడలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.33.68లక్షల ఔషధాలను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సూర్యాపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోదాడలోని గోదాముల్లో అనుమతి లేకుండా భారీగా ఔషధాలను నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు ఖమ్మం, నల్లగొండ, వరంగల్, సూర్యాపేట జిల్లాలకు చెందిన అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతి తీసుకోకుండా కోదాడ పట్టణంలోని సురేష్ ఆర్థోపెడిక్ ఆసుపత్రి మూడో ఫ్లోర్‌లో నిల్వఉంచిన రూ.12.30లక్షల విలువైన ఔషధాలు,భవానీ మెడికల్ దుకాణంలో రూ.12.25లక్షలు, చెన్నకేశవ గోదాంలో రూ.3.04లక్షలు, మహిత మెడికల్ గోదాంలో రూ.6.09లక్షలు మొత్తంగా నాలుగు గోదాముల్లో రూ.33.68 లక్షల విలువైన ఔషధాలను గుర్తించారు. వాటిలో రూ.1.31లక్షల విలువైనవి గడువు తీరినవిగా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఔషధాలతోపాటు గోదాములను సీజ్ చేశారు. తనిఖీల్లో వరంగల్ డీటీ ఆర్యవర్ధనచారి, నల్లగొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేదాస్, డీఐ సోమేశ్వర్, ఖమ్మం ఏడీ ప్రసాద్, సూర్యాపేట డీఐ సురేందర్, భువనగిరి డీఐ అశ్విన్, ఖమ్మం డీఐ అనిల్, హన్మకొండ డీఐ కిరణ్, జనగామ డీఐ బాలకృష్ణతో పాటు ఆరుగురు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్



(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్‌ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్పడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూకుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు

» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?

» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం

» హార్డ్ డిస్క్‌ల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు

» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా

» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?

» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్‌కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి

» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ

» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు

» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

ఆహ్లాదకరంగా పార్కులను తీర్చిదిద్దుతున్నాం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 11: పట్టణంలోని పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని, కాలనీల్లో పిల్లలు, మహిళలందరికీ పార్కులు అందుబాటులోకి రానున్నాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 34వ వార్డులో సోమవారం రూ.20 లక్షలతో చేపట్టే పార్కు అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసి మాట్లాడారు. భవిష్యత్తులో కాలనీలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్కు పక్కన వరద కాల్వ వెళ్తున్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, పైప్‌లైన్ వేయడంతో పాటు కాల్వపై కప్పు కూడా వేయించనున్నట్లు తెలిపారు. వార్డు కౌన్సిలర్ రావిరాల పూజితవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్, వేంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు నూకల జైపాల్‌రెడ్డి, నాయకులు కత్తుల షణ్ముక, బత్తిని వెంకటేశ్వర్లు, గార్లపాటి వెంకటయ్య, శంకర్‌గౌడ్, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, డివెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, కేశవ్, అశ్విన్, వెంకన్న, రాంరెడ్డి, లింగారెడ్డి, చక్రవర్తి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఇవ్వాలి

మిర్యాలగూడ, మార్చి 11: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెంటనే సుప్రీంకోర్టులో సమర్పించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌బీఐ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌బీఐ ప్రజల కోసం కాకుండా బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తోందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను బేఖాతత్ చేయడం ఎస్‌బీఐకి తగదన్నారు. అనంతరం కేంద్రప్రభుత్వం, ఎస్‌బీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డబ్బీకార్ మల్లేష్, ఊర్మిళ, పాపానాయక్, సైదులు, పూలమ్మ, రామారావు, వెంకట్‌రెడ్డి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకే ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మర్రిగూడ, మార్చి 11: మండలంలోని ఖుదాబక్షుపల్లి గ్రామంలో 1996లో నాటి ప్రభుత్వం సర్వే నెంబర్ 277, 278, 289లో 739 ఎకరాలను నిరుపేద రైతులకు ఉచితంగా కేటాయించింది. చర్లగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంది. ఇన్నాళ్లు అదే భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న రైతులు ఉపాధి కోల్పోయారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ భూమి తమకే ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతులకు సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి, బూడిద సురేష్, మహేందర్, యాదయ్య, శ్రీశైలం, సుభాష్, దేవేందర్, గిరి పాల్గొన్నారు.

ఎకరానికి రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

నకిరేకల్, మార్చి 11: భూగర్భజలాలు అడుగంటి బోరు బావుల్లో నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను ప్రభుత్వం అంచనా వేసి ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి డిమాండ్ చేశారు. నకిరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను సోమవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే దశలో ఎండిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, పసుపులేటి సోమయ్య, బండారి మురళి, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, నారగోని లక్ష్మి, యాస శోభ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

దామరచర్ల, మార్చి 11: పాఠశాల సమయం ముగియకముందే తాళం వేసి వెళ్లిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. మండలంలోని పుట్టలగడ్డ, తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సమయం ముగియక ముందే పాఠశాలకు తాళం వేసి వెళ్లారని ఆరోపించారు. మండలంలో పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ముడావత్ జగన్, కుర్ర సైదానాయక్, ధీరావత్ వీరన్ననాయక్, నాగేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

డిండి, మార్చి 11: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) దేవరకొండ డివిజన్ ఇన్‌చార్జి గాదె గిరిధర్‌రావు అన్నారు. డిండి మండల కేంద్రంలోని నీటి పారుదల అతిథిగృహంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో టీయూడబ్ల్యూజే నూతనకమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. టీయూడబ్ల్యూజే నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వంగాల శేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు అవుట మల్లేష్, ఉపాధ్యక్షులు పేర్ల మహేష్, గణపతి, ప్రధానకార్యదర్శి బలుమూరి ఆంజనేయులు, కార్యదర్శి ముడిలింగం, కాసుల బలేషచారి, కోశాధికారి పర్వతాలు, సలహాదారులు చిర్ర వెంకట్‌రెడ్డి, ముడి శ్రీను, కార్యవర్గ సభ్యులుగా చెన్నయ్య, రవిలను ఎన్నుకున్నారు.

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్యయాదవ్

చండూరు, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నామరూపం లేకుండా పోతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధం, మోసపు పునాదుల మీద నిలిచిన బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక, ఆ పార్టీకి చెందిన నాయకులు ఇతర పార్టీలోకి వలస పోతున్నారని విమర్శించారు. ఎంపీ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. సమావేశంలో ఎర్రజెల్ల లింగయ్య, షరీఫ్, యాదయ్య, లింగయ్య, వెంకన్న, బిక్షం పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, మార్చి 11: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని మధ్యాహ్న భో జన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోలే సత్యనారాయణ డి మాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్మికుల సమస్యలపై కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదు నెలల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోలగాని యాదమ్మ, మేడి హంస, నాయకులు సంగీత, రూతు, సత్తెమ్మ, మట్టమ్మ, సైదమ్మ, ఇందిర పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న తహసీల్దార్

కొండమల్లేపల్లి, మార్చి 11: మృతి చెందిన భర్త పేరిట ఉన్న వ్యవసాయ భూమిని తన పేరిట మార్చుకోలేని పరిస్థితి ఆ వృద్ధురాలిది. అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ దివ్యారెడ్డి స్వయంగా ఆ మహిళ ఇంటికి భూమి పట్టా చేయించారు. మండలంలోని చెన్నారం గ్రామ పరిధిలోని గన్యనాయక్‌తండాలో రమావత్ లాలి ఇంటికి వెళ్లి వ్యవసాయ భూమిని ఆమె పేరిట పట్టా చేయించారు. ఆమె వెంట జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌యాదవ్, ధరణి ఆపరేటర్ మహేష్ ఉన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి


హాలియా: పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, చింతపల్లి, దేవరకొండ, శాలిగౌరారం, కనగల్, మార్చి 11: దేవాలయాలు ఆధ్యాత్మికకు నిలయాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియాలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో సంప్రోక్షణ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు మానవులు క్రమబద్ధంగా జీవించడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, ఎడమకాల్వ మాజీ వైస్‌చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కాకునూరి నారాయణగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, నాయకులు వర్కాల సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయ బ్ర హ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి ఆదిత్యుని మహేంద్రశర్మ, భాస్కర్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొమిరిశెట్టి వెంకటయ్య, ఉత్సవకమిటీ సభ్యులు ఎల్లంకి రవి, తెరటిపల్లి రాములు, సత్యనారాయణ, గోవిందు రవి, ప్రసాద్, మహేష్‌గౌడ్, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● దేవరకొండ మండలం ముదిగొండ కమలాపూర్ వీరభద్రస్వామి జాతర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వీరభద్రస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు జాల నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, వడ్త్య దే వేందర్‌నాయక్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలం బైరవునిబండ గ్రామంలోని శ్రీగంగాభవానీ సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున అగ్నిగుండాలు, హోమం, ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన కన్నుల పండువగా నిర్వహించారు. అగ్నిగుండాల కార్యక్రమంలో నిప్పు మీద భక్తులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం బైరవునిబండ, రామాంజపురం గ్రామాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అక్కడకు చేరుకున్న ఎస్ఐ అవిలయ్య వారిని చెదరగొట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దండ రేణుకఅశోక్‌రెడ్డి, పూజారి వనం రమేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సిరెడ్డి, యాదయ్య, కరుణాకర్, శంకర్ పాల్గొన్నారు.

● కనగల్ మండల కేంద్రంలోని శ్రీపార్వతి బండి రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం స్వామివారి దివ్యరథసేవ ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్, చిట్ల లింగయ్యగౌడ్ గ్రామస్థులు నర్సింగ్ మురళిగౌడ్, శివశంకర్, కిరణ్, కరుణాకర్, శంకర్ పాల్గొన్నారు.


దేవరకొండ: కమలాపూర్ వీరభద్రస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్


శాలిగౌరారం: బైరవునిబండ గ్రామంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న భక్తులు


కనగల్: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే వీరేశం


కట్టంగూర్ పీహెచ్‌సీలో నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, కట్టంగూరు, నకిరేకల్, మార్చి 11: చిట్యాల మునిసిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. పట్టణంలోని మునిసిపాలిటీకి మంజూరైన ట్రాక్టర్ వాటర్‌ట్యాంకర్, చెత్త సేకరించే ఆటోను సోమవారం మిర్యాలగూడెం ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తుందన్నారు. పదేళ్లలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అంతకుముందు ఆయన పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, కౌన్సిలర్లు జడల పూలమ్మ, జిట్ట పద్మ, జమాండ్ల జయమ్మ, లింగస్వామి, కృష్ణ, సత్తయ్య, నాయకులు ఇబ్రహీం, కృష్ణ, పరమేశం, మధు పాల్గొన్నారు.

● పేదలకు మెరుగైన సేవలందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు మండలంలోని ముత్యాలమ్మగూడెం, పరడ, ఈదులూరు, మునుకుంట్ల, పందనపల్లి, అయిటిపాముల, బొల్లేపల్లి, ఇస్మాయిల్‌పల్లి గ్రామాల్లో సుమారు రూ.90లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు కట్టంగూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన దవాఖానా భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కొండల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో లోకసాని వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గగులోతు ప్రసాద్, వైద్యాధికారి శ్వేత, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు సుంకరబోయిన నర్సింహ, కక్కిరేణి వెంకటేశ్వర్లు, సు కృయ్య, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, బెజవాడ సైదులు, పెద్ది యాదగిరి, పులిగిల్ల అంజయ్య, గడుసు సుధీర్‌రెడ్డి, పుట్టవెంకట్‌రెడ్డి, గద్దపాటి దానయ్య, రెడ్డిపల్లి సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పిట్‌మెంట్ ప్రకటించడంపై నకిరేకల్ నియోజకవర్గ ఆర్టీసీ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నకిరేకల్‌లో సోమవారం ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సాధక బాధకాలను తెలుసుకుని పిట్‌మెంట్ ప్రకటించిందని అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీ వీరార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం, ఆర్టీసీ ఉద్యోగులు మన్నాన్, పల్స వీరయ్య, నాగాచారి, జీఎస్‌రావు, పురం పుల్లయ్య, జాన్‌రెడ్డి, కృష్ణ, సైదులు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పొదుపు చేయాలి

వేములపల్లి, మార్చి 11: ప్రతి మహిళ పొదుపు చర్యలు పాటించి ఆర్థికంగా బలోపేతం కావాలని ఆర్థిక అక్షరాస్యత ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగదీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం మహిళ సంఘాలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామలింగయ్యతో కలిసి మాట్లాడారు. మారుతున్న జీవనశైలి ఆధారంగా ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన చేయించుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ వేములపల్లి మేనేజర్ దేవర గోపి, ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ మాతంగి అనిల్‌కుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, ఏపీఎం అనూక్, సీసీలు గోపి, రమణయ్య, సురేందర్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

చింతపల్లి, మార్చి 11: చింతపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా అధికారులు సోమవారం తనిఖీ చేశారు. జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు మంగ్యానాయక్, దశరథం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న వసతులను చీఫ్ సూపరింటెండెంట్ నేముల రామస్వామిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.


బీజేపీని ఓడించేందుకు కలిసికట్టుగా పోరాడాలి

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, మార్చి 11: దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని, అందుకు రాబోయే ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తామని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో పేదలు మరింత పేదరికంలోకి నెట్టి వేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్లకు పట్టం కడుతున్న బీజేపీని మరోమారు గెలిస్తే దేశం మరింత ప్రమాదంలోకి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా ఇండియా కూటమి ఏర్పడిందన్నారు. సమావేశంలో నాయకులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, జగదీష్‌చంద్ర, పాండు, గాదె పద్మ, మంగారెడ్డి, సత్యనారాయణ, రాంమూర్తి, కృపాకర్ పాల్గొన్నారు.

● రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌పీ) రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి యాద్గార్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్పీ బలపరిచిన ఎంసీపీయూ నల్లగొండ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, నాయకులు వస్కుల మట్టయ్య, సునీల్, పాండురంగాచారి, పోతుగంటి కాశి, భరత్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

కూలిన బతుకులు

● రైస్‌మిల్లులో గోడ కూలి ఇద్దరు కార్మికులు మృతి


ప్రమాదస్థలంలో కూలిన బస్తాలు (ఇన్‌సెట్‌లో) బీహార్ కార్మికుల మృతదేహాలు

మిర్యాలగూడ రూరల్, మార్చి 11: గోదాములో గోడ కూలి ఇద్దరు బీహార్ కూలీలు మృతి చెందారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటాద్రిపాలెం గ్రామంలోని భరణి రైస్‌మిల్లులో 50 మంది బీహార్ కార్మికులు ఆరు నెలలుగా హమాలీ పని చేస్తున్నారు. రోజువారీ పనుల్లో భాగంగా 20మంది కూలీలు సోమవారం గోదాములో ఉన్న బస్తాలను మిల్లింగ్ కోసం బయటకు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో గోదాం మధ్యలో ఉన్న భారీ గోడ కూలి హమాలీలపై పడింది. అనుకోని సంఘటనతో భయభ్రాంతులకు గురైన బయటకు పరుగెత్తగా, బస్తాలు ఎత్తుతున్న బీహార్ రాష్ట్రం సమస్తాపూర్ జిల్లాకు చెందిన రఘువీర్‌సాహు (45), బేగూర్‌సలాయ్ జిల్లాకు చెందిన గంగాప్రసాద్ (55) గోడ కింద పడిపోయారు. పైనుంచి పెద్దసంఖ్యలో బస్తాలు వారిపై సహచర కార్మికులు అప్రమత్తమై జేసీబీతో వాటిని తొలగించారు. అప్పటికే వారిద్దరూ మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ వీరబాబు తెలిపారు. మృతుడు గంగాప్రసాద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా, రఘువీర్‌సాహుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు కుటుంబ సభ్యులను బీహార్‌లోని స్వగ్రామాల్లోనే వదిలి పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చారు. ఆరు నెలలు పని చేసిన అనంతరం వారు తిరిగి తమ రాష్ట్రానికి వెళతారని కార్మికులు చెబుతున్నారు. గోదాములో సామర్థ్యానికి మించిన ధాన్యాన్ని నిల్వ చేయడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న గోడను గుర్తించకుండా ఉండటం వల్లే ఇద్దరు కార్మికులు మృతి చెందినట్లు తెలుస్తుంది. మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం సంభవించినట్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పలువురు పేర్కొంటున్నారు.

ఉద్యోగం రాలేదని బలవన్మరణం

● డిండి రిజర్వాయర్‌లోకి దూకి ఆత్మహత్య


గిరీష్‌కుమార్ (ఫైల్)

డిండి, మార్చి 11: ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం డిండి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. డిండి ఎస్ఐ రాజు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునుగోడు మండల కేంద్రానికి చెందిన శేరుపల్లి గోపాల్, పద్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. గోపాల్ మగ్గం నేస్తుండగా భార్య పద్మ ఆయనకు చేదోడువాదోడుగా ఉంటోంది. పెద్ద కుమారుడికి వివాహం కాగా, నల్లగొండ పట్టణంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు శేరుపల్లి గిరీష్‌కుమార్ (29)ఎనిమిదేళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని రామానందతీర్థ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. మూడో కుమారుడు కిరణ్ డిండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేసి గత ఏడాది నాంపల్లికి బదిలీపై వెళ్లాడు. గిరీష్‌కుమార్, కిరణ్‌కు వివాహం కాలేదు. గిరీష్‌కుమార్ తాను చదివిన సివిల్ ఇంజనీరింగ్ కోర్సుకు సంబంధించి ఉద్యోగాల కో సం ప్రైవేటు కంపెనీలకు దరఖాస్తు చేసుకుంటూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. సరైన ఉద్యోగం దక్కడం లేదని కొంతకాలంగా తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన శ్రీశైలం వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. శనివారం అక్కడే ఉండి మొక్కు తలనీలాలు సమర్పించుకున్నాడు. ఆదివారం రాత్రి డిండి ప్రాజెక్టు ఎడమవైపు టవర్ వద్ద నుంచి రిజర్వాయర్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు నీటిపై తేలుతున్న గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. రిజర్వాయర్ వద్దకు చేరుకున్న పోలీసులు మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మునుగోడు మండల కేంద్రానికి చెందిన శేరుపల్లి గిరీష్‌కుమార్‌గా గుర్తించారు. సోదరుడు కిరణ్ కోసం అప్పుడప్పుడు డిండికి వచ్చి వెళ్తుండటంతో స్థానికులు గుర్తించి కిరణ్‌కు సమాచారమిచ్చారు. సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

మత సామరస్యంతో పండుగలు నిర్వహించుకోవాలి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 11: హిందూ, ముస్లింలు మత సామరస్యంతో తమ సంప్రదాయ పండుగలు నిర్వహించుకోవాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు కోరారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాన్ని అతిక్రమించకుండా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేకంగా పోస్టింగులు పెడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హిందూ, ముస్లిం మతపెద్దలు, సీఐలు నాగార్జున, సుధాకర్, ఎస్ఐలు రాంబాబు, కృష్ణయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

చండూరు రూరల్, మార్చి 11: మండలంలోని కస్తాల గ్రా మంలో సోమవారం ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భూతం వెంకటేశం, భార్య నాగమ్మతో కలిసి వ్యవసాయ కూలీగా పనిచేస్తూ ఇద్దరు కుమారులను చదివిస్తున్నాడు. సోమవారం ఉదయం వెంకటేశం పనికి వెళ్లగా భార్య ఇంటి వద్దే ఉంది. కూలీ పనిలేకపోవడంతో సమీపంలోని చెట్టు కింద స్థానికులతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటినుంచి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన ఆమె, స్థానికులు మంటలను ఆర్పివేశారు. అంతలోనే సామాగ్రితో పాటు కుమారుల సర్టిఫికెట్లు, వెండి, బంగారు ఆభరణాలు, బైక్ కాలిబూడిదయ్యాయి. 15 గ్రాముల బంగారం, 25 తులాల వెండి, టీవీ, బైక్, 4 క్వింటాళ్ల బియ్యం, వంటసామగ్రి, మహిళా సంఘం నుంచి వచ్చిన రూ.80 వేలు, కూలీ డబ్బులు రూ.40 వేలు మొత్తం రూ.1.20 లక్షలు అగ్నికి ఆహుతయ్యాయని, పూర్తిగా రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకుని తగిన సాయం అందించాలని స్థానికులు కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి తీగలు చోరీ

దామరచర్ల, మార్చి 11: రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలతో పాటు ఆయిల్‌ను దొంగలు చోరీచేశారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున మండలంలోని రాజగట్టు శివారులో చోటు చేసుకుంది. గ్రామసమీపంలోని 25కేవీ సామర్థ్యం కలిగిన రెండు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రూ.40వేల విలువైన రాగి తీగలను, ఆయిల్‌ను దొంగలు చోరిచేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రాణభయం ఉందంటూ మహిళ ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 11: తన కుటుంబానికి ప్రాణాపాయం పొంచి ఉందంటూ ఓ వితంతు మహిళ సోమవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ కావ్యశ్రీ తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన అన్నెబోయిన శివప్రసాద్‌తో 2010లో తనకు వివాహం జరిగిందని, ఇద్దరు కవలపిల్లలు కలిగారని తెలిపింది. 2016లో తన భర్తకు టెండర్ ద్వారా మంజీరా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వచ్చిందన్నారు. గ్యాస్ ఏజెన్సీని నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న తరుణంలో తన భర్త అనారోగ్యంతో మృతి చెందాడని బాధిత మహిళ తెలిపింది. నామినీ కింద తన భర్తకు దక్కిన ఏజెన్సీని నిర్వహిస్తూ పిల్లలను పోషించుకుంటున్నానని బాధిత మహిళ వివరించింది. అయితే తన మామ మట్టయ్య ఆయన రెండో భార్య, ఆమె కుమారుడితో కలిసి గ్యాస్ ఏజెన్సీని వారికి అప్పగించాలని వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయింది. గ్యాస్ ఏజెన్సీని బెదిరించే తీసుకునే ప్రయత్నంలో భాగంగా తనపై దాడి చేసి తీవ్రస్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందింది. తన మామ, ఆయన రెండోభార్య కుటుంబం నుంచి తన ఇద్దరు కుమారులతో పాటు, తనకు ప్రాణాపాయం ఉందంటూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ కావ్యశ్రీ తెలిపింది. కాగా తమకు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి వ్యాన్ పల్టీ

చింతపల్లి, మార్చి 11: మండలంలోని హైదరాబాద్ - నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై వ్యాన్ అదుపు తప్పి పల్టీకొట్టిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండ నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు వెళ్తున్న వ్యాన్ మండలంలోని నసర్లపల్లి స్టేజీ సమీపంలో టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ఘటనతో వ్యాన్‌లో ఏడుగురు వ్యక్తులు ఉండగా లక్ష్మి అనే మహిళకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ సంఘటనా స్థలానికి చే రుకొని ప్రయాణికులను ఇతర వాహనంలో స్వగ్రామానికి తరలించారు.

యురేనియం కలకలంపై అధికారుల విచారణ

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 11: పెద్దఅడిశర్లపల్లి మండలంలో జిల్లా మైనింగ్ ఏడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు విచారణ చేపట్టారు. మండలంలోని పెద్దగట్టు, నంబాపురం గ్రామాల్లో రెండు రోజుల క్రితం హెలికాప్టర్ చక్కర్లు కొట్టడంతో మళ్లీ యురేనియం సర్వే చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో సోమవారం వారు ఆయా గ్రామాల్లో పర్యటించారు. గతంలో ఈ ప్రాంతాల్లో యురేనియం నిక్షేపాల కోసం కేంద్ర ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు సర్వే నిర్వహించారు. దీన్ని ప్రజలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. కాగా, హెలీకాప్టర్ చక్కర్లు కొట్టడంతో మళ్లీ యురేనియం నిక్షేపాల కోసం సర్వే అంటూ సోషల్‌మీడియాలో వైరల్ అయింది. వారం రోజులుగా గ్రామ పరిసర ప్రాంతాల్లో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్), భారత అణు పరిశోధన సంస్థ (ఐఎండీ) ప్రతినిధులు ఎవరైనా సంచరించారా అని ప్రజలను విచారించారు. అలాంటి అధికారులు ఎవరూ రాలేదని వాట్సాప్ గ్రూపులోనే ఫొటోలు చూశామని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వ వాహనాల పేర్లతో ఎవరైనా వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు తెలియజేసినట్లు వారు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా అనంత చంద్రశేఖర్

చండూరు, మార్చి 11: కాంగ్రెస్ పార్టీ చండూరు మండల, పట్టణ అధ్యక్షులుగా ఉడుతలపల్లి గ్రామానికి చెందిన కొరిమి ఓంకారం, అంగడిపేటకు చెందిన అనంత చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఎంపిక చేశారు. సోమవారం ఆయన తన నివాసంలో నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.